# విత్తన, ఎరువుల దుకాణాల తనిఖీ



బషీరాబాద్: కాశీంపూర్ రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు



పెద్దేముల్ : మంబాపూర్‌లో జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకుడు వినోద్‌కుమార్



పరిగి: విత్తనాలు, ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న కొడంగల్ ఏడీఏ శంకర్

పరిగి, మే 22: డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా రసీదు అడిగి తీసుకోవాలని కొడంగల్ ఏడీఏ శంకర్ సూచించారు. బుధవారం పరిగిలోని పలు విత్తన, ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి ప్రభాకర్‌రెడ్డితో కలిసి కొడంగల్ ఏడీఏ శంకర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాకు, ఇతర వివరాలతో కూడిన రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని, వాటికి రసీదు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో విత్తనాలను ఎవరైనా విక్రయిస్తే వెంటనే వారి వివరాలను వ్యవసాయాధికారులకు తెలియజేయాలని చెప్పారు. జిల్లాలో పోలీసు టాస్క్‌ఫోర్స్ సైతం పనిచేస్తున్నదని, డీలర్లు మేలు రకాలైన విత్తనాలనే విక్రయించాలన్నారు. విత్తన విక్రయాలు ప్రతిరోజు స్టాక్ రిజిస్టర్‌లో రాయాలని పేర్కొన్నారు. విత్తన బిల్లులపై రైతుల సంతకాలు తీసుకోవాలని, ప్రతి డీలర్ తప్పనిసరిగా స్టాక్ బోర్డు, ధరల పట్టికలు ఉంచాలని సూచించారు. చట్టపరమైన అన్ని ధ్రువపత్రాలను డీలర్లు తమవద్ద ఉంచుకోవాలని అన్నారు.

**పెద్దేముల్:** రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని వికారాబాద్ జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకుడు వినోద్ కుమార్ హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని మంబాపూర్ గ్రామంలోని ఓ ఎరువుల దుకాణంలో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, పురుగుమందుల బిల్లులను, కవర్లను భద్రపరుచుకోవాలన్నారు. రైతులు లూజ్ విత్తనాలు కొనరాదని, లూజ్ విత్తనాలు ఎవరైనా అమ్మినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి నజీరొద్దీన్ ఉన్నారు.

**బషీరాబాద్:** ఎరువులు, మందులు తీసుకున్న రైతులకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని వికారాబాద్, తాండూరు ఏడీఏలు వినోద్‌కుమార్, రుద్రమూర్తి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎరువులు, మందుల దుఖాణాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలం చెల్లిన మందులు, లూజు విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. విత్తనాలు, ఎరువులు తీసుకున్న రైతు, రైతు తండ్రి పేరు తప్పనిసరిగా నమోదు చేయాలని ఎరువులు, మందుల దుకాణాల యజమానులకు సూచించారు. ధరల పట్టిక సూచిక బోర్డును తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరకే విక్ర యించాలని తెలిపారు. నిషేధిత మందులు, విత్తనాలు అమ్మితే కేసులు నమోదు చేస్తామన్నారు. వారి వెంట ఏవో సూర్యప్రకాశ్ తదితరులు ఉన్నారు.



వికారాబాద్: మోమిన్‌పేటలో ఏడీఏ లక్ష్మీకుమారి

**వికారాబాద్:** విత్తన దుకాణాల్లో రైతుల రిజిస్టర్ తప్పనిసరిగా చేసుకోవాలని ఏడీఏ లక్ష్మీకుమారి అన్నారు. బుధవారం మోమిన్‌పేట మండల పరిధిలో పలు విత్తన దుకాణాలను వ్యవసాయ అధికారుల ఇంటర్నల్ స్క్వాడ్ బృందం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ సంవత్సరం నుంచి కొత్తగా విత్తన దుకాణదారులు తప్పనిసరిగా విత్తనాలను కొనుగోలు చేసిన రైతుల జాబితాను తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. రిజిస్టర్ లో రైతు పేరు, తండ్రి పేరు, గ్రామం, మొబైల్ నంబర్ విత్తన రకము తదితర వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. దుకాణాల్లో తీసుకున్న విత్తనాలకు బిల్లులను తప్పనిసరిగా తీసుకోవాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా దుకాణ యజమానులను ఏరోజుకారోజు స్టాకులను స్టాకు బోర్డు పై ప్రదర్శించాలని తెలిపారు. ప్రతి రైతుకు బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. అధిక ధరలకు విత్తనాలను విక్రయించినట్లయితే చట్టప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ స్క్వాడ్ బృందంలో వ్యవసాయ అధికారి జయశంకర్ పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న పీఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, తండావాసులు

కులకచర్ల, మే 22: గిరిజన తండాలకు విద్యుత్ సరఫరాను సక్రమంగా చేయక విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని పీఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం కులక చర్ల మండల పరిధిలోని ఘనాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గోప్యనాయక్, సుబ్యానాయక్, సక్ర్యనాయక్‌తండాల్లో విద్యుత్ వైర్లను సరిచేయకపోవడంతో సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ఆయా తండా వాసులతో కలిసి ధర్నా నిర్వహించారు. తండాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకోవాలని ఆదేశించినా విద్యుత్ అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. విద్యుత్ అధికా రుల నిర్లక్ష్యం కారణంగా తండాల ప్రజలు చీకట్లలో మగ్గుతున్నార న్నారు. ఘనాపూర్ గ్రామ పంచాయతీ గోప్యనాయక్‌తండా సమీపం లో ఉన్న పాఠశాల భవనానికి విద్యుత్ సౌకర్యం లేక అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ నిర్వహిస్తున్న పనులు సాగడం లేదన్నారు. గ్రామ పంచాయతీతో పాటు తండాలకు విద్యుత్‌ను పుట్టపహాడ్ నుంచి సరఫరా చేస్తున్నారని, లైన్ సమస్యలు చాలా ఉన్నాయని బండవెల్కిచర్ల నుంచి విద్యుత్ సరఫరా చేయాలని తెలిపారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించకుంటే మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయ కులు చీపిరి రాములు, మాజీ వార్డు సభ్యుడు బోజ్యానాయక్, గ్రామస్తులు శ్రీధర్‌నాయక్, రాజునాయక్, విజయ్, పాండేనాయక్, మైబు, కొండ నర్సింహులు, రత్న మ్మ, చంద్ర్యనాయక్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏఈ సాయికృష్ణకు వినతిపత్రం సమర్పించారు.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాలల సంక్షేమ సమితి చైర్మన్ వెంకటేశ్

వికారాబాద్, మే 22 : విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బాలల సంక్షేమ సమితి చైర్మన్ వెంకటేశ్ అన్నారు. బుధవారం జిల్లా మహిళా శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా బాల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని గంగారం కాలనీలో మత్తు పదార్థాలు వాడకం, పిల్లలకు మద్యం అమ్మకం నిషేధం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత సోషల్ మీడియా, టెక్నాలజీ ప్రభావంతో మత్తు పానీయాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నా రన్నారు. వినోదం, జల్సాల కోసం మాదకద్రవ్యాలను ఉపయోగిస్తున్నారని, దీనిని అరికట్టవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను ఎప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు. గ్రామాల్లో, పట్టణాలలో సంబంధిత షాపు యజమానులు పిల్లలకు మత్తు పానీయాలను విక్రయించరాదని, ఒకవేళ పిల్ల లకు మత్తు పదార్థాలు విక్రయిస్తే వారి పైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ బాలల పరిరక్షణ విభాగం ఆధ్వ ర్యంలో పిల్లలకు మత్తు పదార్థాల వాడకం, అమ్మకం నిషేధం వంటి అంశాలపై జిల్లాలో బాల ల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నామన్నారు. ఒకవేళ పిల్లలకు మద్యం విక్రయించినట్లు తెలిస్తే సంబంధిత యజమానిపై ఎక్సైజ్ శాఖ వారికి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వరమ్మ, జిల్లా బాలల పరిరక్షణ అధి కారి శ్రీకాంత్, ఎక్సైజ్ శాఖ అధికారి వీరాంజనేయులు, కానిస్టేబుల్ అలీముద్దీన్, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ రాజు నాయక్, బాల పరిరక్షణ సిబ్బంది వనమాల , వీరమ్మ పాల్గొన్నారు.

## పచ్చి రొట్ట ఎరువులపై 60% రాయితీ

పెద్దేముల్, మే 22: పచ్చి రొట్ట ఎరువులపైనా 60% శాతం రాయితీ ఉందని మండల వ్యవసాయ అధికారి నజీరొద్దీన్ తెలిపారు. జనుము 40 కిలోల బస్తా పూర్తి ధర రూ.3620/-ఉండగా రైతులు రూ.1448/ చెల్లిస్తే సరిపోతుందన్నారు. ప్రస్తుతం జనుము బస్తాలు (100) రైతుల కోసం అందుబాటులో ఉన్నాయన్నారు. పచ్చిరొట్ట ఎరువుల కావాల్సిన రైతులు సంబంధిత గ్రామాల క్లస్టర్ల ఏఈవోలను సంప్రదించి పర్మిట్‌లను పొంది తాండూరు అగ్రోస్ కేంద్రంలో విత్తనాలను తీసుకోవా లన్నారు.విత్తనాలు తీసుకోవడానికి రైతులు ఆధార్ కార్డు, పట్టా పాసు పుస్తకం జిరాక్స్‌లను తీసుకొని పర్మిట్‌లను పొందాలని సూచించారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెద్దేముల్, మే 22 : విద్యుత్ సరఫరాకు సంబంధించి వివిధ రకాల మరమ్మతులు ఉన్నందున మండల పరిధిలోని గాజీపూర్, ఇందూరు, తట్టేపల్లి, మంబాపూర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరాను గురువారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు తాండూరు విద్యుత్ డీఈ భాను ప్రసాద్, ఏడీఈ ఆదినారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత గ్రామాల ప్రజలు విద్యుత్ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కులకచర్ల, మే 22 : ఈ నెల 24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కులకచర్ల శ్రీ రామలింగేశ్వర కళాశాల ప్రిన్సిపాల్ కామేశ్వరీ తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ఉదయం 9 నుంచి 12.00వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రానికి విద్యార్థులు అరగంట ముందుగానే చేరుకోవాలని పరీక్షా కేంద్రంలో 1,218 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని, ప్రథమ సంవత్సరం విద్యార్థులు 824 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 394 మంది ఉన్నట్లు తెలిపారు.

## నేడు రామలింగేశ్వర స్వామి గిరిప్రదక్షిణ

కులకచర్ల, మే 22 : కులకచర్ల మండల పరిధిలోని బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వర స్వామి దేవాలయం చుట్టూ పౌర్ణమి సందర్భంగా గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం సాయంత్రం 4గంటల నుంచి రామలింగేశ్వర స్వామి గిరిప్రదక్షిణ కార్యక్రమం ప్రారంభమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# పాఠశాలల్లో పనుల పరిశీలన



మంచినీటి నల్లాలను పరిశీలిస్తున్న ఏఈ, జీహెచ్‌ఎం

బొంరాస్‌పేట, మే 22 : మండలంలోని బొంరాస్‌పేట, కూబ్యానాయక్‌తండా, లింగన్‌పల్లి తదితర గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పంచాయతీ రాజ్ ఏఈ సురేందర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. విద్యుత్, మంచి నీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరయ్యాయని, చేపట్టిన అన్ని రకాల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన హెచ్‌ఎంలకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం హరిలాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, నాయకులు రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా లక్ష్మీనర్సింహాస్వామి జయంతి ఉత్సవాలు



ఉత్సవాల్లో భాగంగా హోమం నిర్వహిస్తున్న దృశ్యం

తాండూరు రూరల్, మే 22: తాండూరు మండలం, కరణ్‌కోట గ్రామంలో బుధవారం లక్ష్మీ నర్సింహాస్వామి జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో ఆలయంలో వేద పండితులు పూజలు చేశారు. ఉదయం 7.00 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హోమం నిర్వహించారు. అనంతరం భక్తులు బావిలో తెట్టేలు విడిచి మొక్కులు చెల్లించుకున్నారు. బావి నుంచి డప్పువాయిద్యాల మధ్య బోనంతో స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## హోంగార్డు నిజాయితీ



కాచిగూడ, మే 22: రోడ్డుపై పోగొట్టుకున్న నగదు ఉన్న బ్యాగు, ఖరీదైన సెల్‌ఫోన్లను బాధితుడికి అప్పగించిన కాచిగూడ ట్రాఫిక్ హోంగార్డు ఎస్.నారాయణరెడ్డి నిజాయితిని చాటుకున్నారు. కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ కథనం ప్రకారం.. మల్లేశ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై కోరంటి నుంచి హిమాయత్‌నగర్ వైపు వెళ్తుండగా మార్గమధ్యలో ఉన్న తెలంగాణ యువతి మండలి రోడ్డుపై నగదు, ఖరీదైన 2 సెల్‌ఫోన్లు, ఇతర పత్రాలు ఉన్న బ్యాగు పడిపోయింది. సమీపంలోనే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ హోంగార్డు ఎస్.నారాయణరెడ్డి రోడ్డుపై ఉన్న బ్యాగును గమనించాడు. బ్యాగులో ఉన్న ఫోన్ సహాయంతో బాధితుడికి గుర్తించి అతడికి బ్యాగును అందజేశాడు. హోంగార్డు నిజాయితిని మెచ్చుకుని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సైలు, సిబ్బంది అభినందించారు.

### చెట్టు విరిగి పైనపడిన ఘటనలో దవాఖాన ఎదుట

# బంధువుల ఆందోళన



బొల్లారం కంటోన్మెంట్ దవాఖాన ఎదుట ఆందోళ న చేస్తున్న మృతుడి బంధువులు



అంబులెన్స్‌లో సరళా దేవి

బొల్లారం, మే 22: బొల్లారం కంటోన్మెంట్ దవాఖానలో చెట్టు విరిగి పైనపడి మృతి చెందిన రవీందర్, తీవ్ర గాయాలైన సరళా దేవి కుటుంబానికి కంటోన్మెంట్ బోర్డు అధికారులు, ఆస్పత్రి వర్గాలు న్యాయం చేయాలంటూ బంధువులు, వారి కుమార్తెలు బుధవారం దవాఖాన ఎదుట ఆందోళన చేశారు. ఈ మేరకు తీవ్ర గాయాలైన సరళా దేవికి గాంధీ ఆస్పత్రిలో సరైన వైద్యం అందడం లేదంటూ అంబులెన్స్‌లో తీసుకొచ్చి ఆందోళనకు దిగారు. కంటోన్మెంట్ బోర్డు అధికారులు, ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రవీందర్ మృతి చెందాడని మండిపడ్డారు. సరళా దేవికి ప్రైవేటు దవాఖానలో వైద్యం అందించాలని, వారి కుమార్తెల్లో ఒకరికి ఉద్యోగంతో పాటు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న బోర్డు అధికారులు రాజ్‌కుమార్, సూపరింటెండెంట్ రామకృష్ణ స్పందిస్తూ.. సరళా దేవికి ప్రైవేటు దవాఖానలో నాణ్యమైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మృతి చెందిన రవీందర్ కుటుంబానికి న్యాయం చేసేందుకు బోర్డు ఉన్నతాధికారులతో చర్చించి న్యాయం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# నల్సార్‌లో.. మిలోన్ బెనర్జి సెంటర్ ఫర్ ఆర్బిట్రేషన్



మిలోన్ కే బెనర్జీ సెంటర్ ఫర్ ఆర్బిట్రేషన్ లా ఏర్పాటుకు పరస్పర ఒప్పందం చేసుకుంటున్న సీనియర్ న్యాయవాది గౌరబ్ బెనర్జీ, నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావులు

శామీర్‌పేట, మే 22: వాణిజ్య సంబంధిత అంతర్జాతీయ వివాదాల పరిష్కారానికి ఆర్బిట్రేషన్ ఒక ప్రధాన విధానమని సీనియర్ న్యాయవాది గౌరబ్ బెనర్జీ, నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావులు అభిప్రాయపడ్డారు. శామీర్‌పేటలోని నల్సార్ లా యూనివర్సిటీ క్యాంపస్‌లో బుధవారం మిలోన్ కే బెనర్జీ సెంటర్ ఫర్ ఆర్బిట్రేషన్ లా ప్రారంభోత్సవంలో పరస్పర అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..భారతదేశానికి 1992- 96, 2004, 09వ సంవత్సరాల్లో అటార్నీ జనరల్‌గా పని చేసిన దివంగత మిలోన్ బెనర్జీ జ్ఞాపకార్థం నల్సార్‌తో ఈ విద్యా కేంద్రాన్ని నల్సార్‌లో ఆరంభించడం జరుగుతున్నదన్నారు. ఆర్బిట్రేషన్ లా అంటే ఒక వివాదాన్ని న్యాయ శాస్త్ర సూత్రాలకు అనుగుణంగా ఇరు పక్షాలు తమకు ఆమోదయోగ్యమయ్యే న్యాయ కోవిదుల ముందుకు తీసుకుపోయి పరిష్కరించుకునే విధానమన్నారు. వాణిజ్య సం బంధ అంతర్జాతీయ వివాదాల పరిష్కారానికి ఆర్బిట్రేషన్ ఒక ప్రధాన విధానంగా ఎదుగుతుందని అభిప్రాయపడ్డారు. త్వరలో ప్రారంభం కాబోయే ఈ సెంటర్‌కు సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రోహింటన్ ఫాలీ నారిమన్ చైర్‌గా, సీనియర్ న్యాయవాది రితిన్ రాయ్ కో చైర్‌గా, గౌరబ్ బెనర్జీ ఈ కేంద్రానికి కావాల్సిన నిధులు అందించే దాత (పోషకుడు)గా, రీసెర్చ్ బోర్డ్‌లో పరిశోధక తోడ్పాటు కోసం నల్సార్ పూర్వ విద్యార్థులు డాక్టర్ అమిత్ జార్జ్ డైరెక్టర్‌గా, శ్రేయా పారిఖ్, చాంద్ చోప్రా అసోసియేట్ డైరెక్టర్లుగా ఉంటారని పేర్కొన్నారు.

# అక్రమాస్తుల కేసులో బెయిల్ పిటిషన్ డిస్మిస్

నాంపల్లి కోర్టులు, మే 22 (నమస్తే తెలంగాణ): హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణకు చెందిన ముగ్గురు బినామీలు గోదవర్తి సత్యనారాయణమూర్తి అలియాస్ జీఎస్‌ఎన్ మూర్తి, పెంట భరత్‌కుమార్, పెంట భరణికుమార్‌ల తరపున దాఖలు చేసిన బెయిల్ పిటిషను డిస్మిస్ చేస్తూ ఏసీబీ కోర్టు జడ్జి మహ్మద్ అఫ్రోజ్ అక్తర్ బుధవారం తీర్పును ప్రకటించారు. బెయిల్ మంజూరు చేయరాదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) చేసిన వాదనలతో ఏకీభవించిన కోర్టు.. బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. విచారణ కొనసాగుతున్న తరుణంలో బెయిల్ మంజూరు చేసే అవకాశం లేదని కోర్టు ఉత్తర్వులలో పేర్కొంది.

## కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులపై కేసులు

ఘట్‌కేసర్, మే 22: ఈనెల 19న జరిగిన పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి మరికొంత మంది బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, నాయకులపై జరిగిన కిడ్నాప్ ఘటనలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులపై కేసులు నమోదైనట్లు ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ సైదులు బుధవారం తెలిపారు.

## పీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా రమణారావు

వనస్థలిపురం, మే 22: టీ పీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా జిల్లా రమణారావు నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ఉత్తర్వులను జారీ చేశారు. రమణారావు రెండు దశాబ్దాలుగా న్యాయవాదిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదులు, ప్రభుత్వానికి వారధిగా ఉంటామన్నారు. ప్రజల్లో న్యాయ వ్యవస్థపై అవగాహన పెంచేందుకు కృషి చేస్తామన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327722-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# న్యాయమూర్తి పేరుతో ఫేక్ ఫోన్‌కాల్స్ చేసిన వ్యక్తి అరెస్ట్

కేపీహెచ్‌బీ కాలనీ, మే 22 : హైకోర్టు న్యాయమూర్తి పేరుతో పోలీసులకు ఫేక్ ఫోన్‌కాల్స్ చేసిన వ్యక్తిని కేపీహెచ్‌బీ కాలనీ పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రావు, డీఐ మధుసూదన్ కథనం ప్రకారం.. కృష్ణా జిల్లాకు చెందిన గొట్టిపాటి సందీప్ (28) డిప్లమా పూర్తి చేసి స్వగ్రామంలోనే ఉంటున్నాడు. అతడికి పరిచయమున్న దీప్తి అనే అమ్మాయి ఉద్యోగ అన్వేషణలో భాగంగా హైదరాబాద్ నగరంలోని ఓ కన్సల్టెన్సీలో డబ్బులు కట్టి మోసపోయింది. కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారణ చేస్తున్నారు. కన్సల్టెన్సీ చేసిన మోసాన్ని దీప్తి తనకు పరిచయమున్న సందీప్‌తో చెప్పింది. ఏపీ హైకోర్టు న్యాయమూర్తితో తనకు పరిచయం ఉందని.. న్యాయమూర్తితో పోలీసులకు ఫోన్ చేయించి త్వరగా న్యాయం జరిగేలా చేస్తానని ఆమెకు సందీప్ మాయమాటలు చెప్పాడు. ఈ క్రమంలోనే దీప్తి వద్ద రూ.50 వేలు వసూలు చేశాడు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తిలా మాట్లాడేందుకు.. సందీప్ తన సెల్‌ఫోన్‌లో స్వరాన్ని మార్చే మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్‌లోని ఎస్సై, డీఐ, సీఐలకు పలుమార్లు ఫోన్‌చేసి ఏపీ హైకోర్టు న్యాయమూర్తిలా మాట్లాడుతూ... దీప్తికి సంబంధించిన కేసును త్వరగా పూర్తి చేయాలని, ఆమెను మోసం చేసిన కన్సల్టెన్సీ నిర్వాహకులను అరెస్ట్ చేసి చర్యలు చేపట్టాలని ఒత్తిడి చేస్తున్నాడు. న్యాయమూర్తి పేరుతో పలు మార్లు వస్తున్న ఫోన్ కాల్స్‌పై అనుమానం వచ్చిన పోలీసులు విచారణ చేయగా... ఫేక్ ఫోన్‌కాల్స్‌గా గుర్తించారు. హైకోర్టు న్యాయమూర్తికి ఏ మాత్రం సంబంధం లేని వ్యక్తి సందీప్ అని, మొబైల్ యాప్‌తో న్యాయమూర్తిలా ఫేక్ ఫోన్‌కాల్స్ చేస్తున్నట్లు నిర్ధారించారు. బుధవారం సందీప్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

బహిరంగ ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా మా క్లయింట్ M/s శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ నారాయణపేట బ్రాంచ్ వారు Lyagala Balakistaiah S/o Lyagala Ramaiah, age 40 years, Occ: Business, R/o H.No.2-9, Ghanapur Village, Kulkacherla k.v, Ranga reddy Dist., **Applicant/ Borrower / Prop. Holders** గారికి ఇచ్చు వ్యాపార లోన్ వ్యవహారాలలో తమ సొంత ఆస్తిని తనఖా పెట్టుటకు అంగీకరించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఆక్షేపణలు మరియు క్లెయిములు ఉన్న యెడల ఈ తేది నుండి 5 రోజులలో మా ఆఫీస్‌లో గాని లేదా మా క్లయింట్ ఆఫీస్‌లో గాని సంప్రదించగలరు.

***SCHEDULE OF THE PROPERTY***

The Residential Plot constructed in residential plots admeasuring 448.00 Sq. Yrds, out of Sy.No. 17/AA Situated at Ghanpur Village, Kulkacherla Mandal KV, Ranga reddy Dist., which is bounded as under : **East:** Vendors Land, **West:** Vendors Land, **North:** Vendors Land, **South:** Land of Parvathamma

**MALLIKARJUN** B.A, LL.B.,
Advocate, 1-6-41/12, Satya Sai Colony, Narayanpet. Cell: 9440393742

# అన్నమాచార్య జయంతి వేడుకలు



లయన్ కేవీ రమణారావును సత్కరిస్తున్న అశోక్‌కుమార్

రవీంద్రభారతి, మే 22: తిరుపతి మహతి కళాక్షేత్రంలో మంగళవారం పదకవితా పితామహుడు శ్రీ అన్నమాచార్య 616వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య సంగీత నృత్యోత్సవం పేరిట నిర్వహించిన సంగీత కార్యక్రమాల్లో వివిధ రాష్ట్రాల నుంచి కళాకారులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, అతిథిగా తాళ్లపాక అన్నమాచార్య 14వ తరం వంశీయులు శ్రీ హరినారాయణచార్యులు విచ్చేశారు. సాంస్కృతిక సేవా సంస్థల అధ్యక్షుడు, జర్నలిస్టు లయన్ కేవీ రమణారావును పోకల అశోక్‌కుమార్, మునిరత్నం, గురువులు సత్కరించారు. కార్యక్రమంలో సాలెం శ్రీవిద్య, యామిని, ప్రసన్నారెడ్డి, మంజుల, పద్మజ, లక్ష్మీప్రవీణా, సిందిరి ఆశా, సునీతాదేవి పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962